అనుబంధం

విశాఖపట్నం నుంచి క్రిష్ణమూర్తి రాసిన ఉత్తరం చదువుకుని తెగ మురిసిపోయింది సత్యావతమ్మ. "పెర్రినాగన్న! నన్ను వదలి ఒక్క నిముషం ఉండలేడు. ప్రొద్దున లేచిన దగ్గర్నుండి రాత్రి పడుకునేవరకు వాడికి అన్నీ నే అమర్చాల్సిందే. ఏపనీ చాతకాదు. భోజనం చేసేటప్పుడుకూడా నేను ప్రక్కనుండి ఇవీ అవీ చెప్పి తినిపించాలిసిందే. పాపం! అక్కడ ఏ మవస్థపడు తున్నాడో ఏమో!" అని ప్రక్కయింటి రత్తమ్మతో మాట్లా డుతూ అంది.

"అవునుమరి. నెలల పిల్లడి దగ్గర్నుంచి నువ్వే పెంచావు. తల్లి నెరుగడు కాని నిన్నే తల్లనుకున్నాడు. బుద్ధిమంతుడు గాబట్టి చదువుకుని వృద్ధిలోకి వస్తున్నాడు. మరి రంగణ్ని అలాగే పెంచావు. మరి వీడు ఇంకా పరీక్షలు తప్పుతునే ఉన్నాడు" అంది రత్తమ్మ.

ఇద్దరికీ ఏభై య్యేళ్లు దాటాయి. సత్యావతమ్మ భర్తపోయి పదిహేనేళ్ళయింది. ఆమెకు సంతానం లేదు. భర్త మరొక రెండేళ్ళకు పోతాడనగా చెల్లెలు సీతమ్మ ఇద్దరి పిల్లలతో, నిరాధారంగా అక్కదగ్గరకు వచ్చేసింది. చెల్లెల్నీ, చెల్లెలి బిడ్డల్నీ ఆదరించి అభిమానించింది సత్యావతమ్మ. చెల్లెలి కొడుకు కృష్ణమూర్తి. కూతురు కమల. మరొక రెండేళ్ళలో భర్త చనిపో

బోతూ దగ్గర బంధువుల అబ్బాయి రంగయ్యనే కుర్రవాణ్ణి దత్తత చేసుకున్నారు.

మనషులలో అభిమానాలూ, మమతలూ ఎలా ఏర్పడు తాయో ఎవరికీ తెలియదు. పెంచుకున్న కొడుకైన రంగయ్య మీదకన్నా, చెల్లెలి కొడుకైనా కృష్ణమూర్తిమీదే ఆవిడ కెక్కువ అభిమానం. దానికి కారణం ముఖ్యముగా పైకి కన్పిం చేది, కృష్ణమూర్తి పెత్తల్లిమీద చూపించే విపరీతమైన అభి మానం. ప్రతి పనికీ అతను పెత్తల్లి అనుమతి అడుగుతాడు. అన్నిపనులు పెత్తల్లికి చెప్పి చేస్తాడు. మాటలు వచ్చిన దగ్గ ర్నుండి, "పెద్దమ్మా! ఏబట్టలు తొడుక్కోమంటావు?" "పెద్దమ్మా, చదువుకోనా?", "పెద్దమ్మా ఆడుకోనా?" అని పెత్తలి అడుగుజాడలలో నడుస్తూ ఆవిడకు సంతోషము కలుగ జేస్తూ నడుచుకుంటాడు. కమలకూడా అదేవిధంగా అన్ని విష యాలలోనూ పెత్తల్లి ననుసరిస్తూ వాళ్ళిద్దరికీ తల్లి చాలా చిన్న తనంలోనే కరువవడంవల్ల, పెత్తల్లిమీదే ఆధారపడి పెరిగారు.

సత్యవతమ్మకు చాలా ఆస్తి ఉంది. మనిషి చాలా చక్క నిది. మనసుకూడా మంచిదే. అఖండమైన తెలివితేటలు గల వ్యక్తి. బంధువుల నాదరించటంలోనూ, పేదవారి కుపకారం చెయ్యటంలోనూ ఆమెకు ఆమే సాటి. ఎన్నో తీర్థయాత్రలు చేసింది. ఆయుర్వేద వైద్యం, జ్యోతిషం, వేదాంతం మొదలైన వాటన్నిటిలోనూ కొంత ప్రవేశంకల వ్యక్తి. ఆ చుట్టుపక్కల వారందరికీ ఆమే ఉచితంగా మందులిచ్చేది. శ్రీకాకుళంలో

ఆమెకు మూడిళ్లున్నాయి. తనకు సంతానం లేకపోయినా ఎంత మంది పిల్లలకో సాయం చేసింది.

తన చేతులతో పెంచిన చెల్లెలి పిల్ల లిద్దరియందూ ఆమెకు గల మమకారం సాటిలేనిది. తన దత్తపుత్రుడైన రంగడియందు ఆమెకు అంత మమకారం లేకపోవడానికి అతని ప్రవర్తనకూడా కొంత కారణం కావచ్చు. వాడెప్పుడూ అల్లరి చిల్లరిగా తిరుగుతూండేవాడు. వాడికి చదువు సరిగ్గా అబ్బలేదు. స్కూలుఫైనలు రెండుసార్లు తప్పాడు. ఇంటికెప్పుడు వస్తాడో, ఎప్పుడు వెళ్తాడో తెలియదు. సత్యవతమ్మ వాడి విషయం పట్టించుకోవడమే మానేసింది. మీగడతో తోడుబెట్టిన గడ్డ పెరుగు కృష్ణమూర్తికి తను స్వయముగా దగ్గర కూర్చుని కృష్ణమూర్తిచేత తినిపిస్తే, రంగడికి పల్చని మజ్జిగకూడ కరు వయ్యేది. ఆదరంతోనూ, అప్యాయతతోనూ కృష్ణమూర్తి పెరిగితే నిర్లక్ష్యంతోనూ, చీవాట్లతోనూ రంగడు పెరిగాడు.

చెడు సావాసాలతో పడి చెడు తిరుగుళ్లు తిరిగుతున్నాడని తెలిసి రంగడి విషయం ఆమె విరక్తి చెందింది. ఉద్యోగంలో ప్రవేశపెట్టించాలని ప్రయత్నించింది ఏవేవో చిన్న చిన్న ఉద్యోగాలు నాలుగైదు చేశాడు. దేనిలోనూ స్థిరంగా ఉండలేదు. వాడికి ఇరవైయేళ్లు దాటి, ఇరవై ఒకటో ఏడు వచ్చాక, పెళ్లి చేస్తే కొంత స్థిరత్వం వస్తుందని అందరూ అనసాగారు. అప్పటికి కృష్ణమూర్తి విశాఖపట్నంలో ఎం. ఎ. పాసయి, ఉన్న ఊరైన శ్రీకాకుళం కాలేజీలో లెక్చరరుగా చేరాడు. అతనికి కూడా

పెళ్లి సంబంధాలు వస్తున్నాయి. పెత్తల్లి ఏం చెప్తే అది చేస్తా డని అందరికీ తెలుసు కాబట్టి. పెద్ద పెద్దవారంతా వేలకొద్దీ కట్నాలిస్తామని వస్తున్నారు, ఆమెవద్దకు తమ పిల్లల్ని చేసుకో మని ప్రార్థిస్తూ.

చిన్నప్పటినుండీ అన్ని విషయాలలోనూ పెత్తల్లి మాట ప్రకారం నడుచుకోవటం అలవాటయిన కృష్ణమూర్తి, పెళ్లి విషయంలో కూడా ఆమెకే నిర్ణయాధికారం వదిలేశాడు కాని చాలాకాలం నుండి అతని మనస్సులో ఒక కోరిక ఉంది. అతని హృదయం ఒక అందమైన పిల్ల ఆకర్షించింది. ఆ పిల్లని చూసి నప్పుడల్లా అతని మనస్సు రెపరెప లాడుతుండేది. విశాలమైన కన్నులు, మెరిసే ఎర్రటి చెక్కిళ్లు పొడుగాటి జడా సన్నని నడుమూ గల ఇందిర అనే పదెనిమిదేళ్ల అమ్మాయి వీళ్లుంటున్న వీధి చివర ఇంట్లో ఉంటున్న ఒక బీద స్కూలు మాష్టారి మూడో అమ్మాయి ఆమె సన్నాలుగో ఏటినుండి కృష్ణమూర్తి మనసులో తిరుగుతూ కళ్లలో మెదుల్తూండేది ఆమె రూపం. ఇందిర తన విశాలమైన కళ్లతో, కృష్ణమూర్తి వైపు చూసిం దంటే, ఆ రాత్రి కృష్ణమూర్తికి సరిగ్గా నిద్రపట్టేదికాదు. ఇంది రను పెళ్లి చేసుకుంటానని, పెత్తల్లితో అనేకసార్లు చెప్పాలని ప్రయత్నించాడు. కాని తనంతట తను ఒకమ్మాయిని పెళ్లి చేసు కుంటానంటే పెత్తల్లి ఏమంటుందో అని చాలరోజులు భయపడి వూరుకున్నాడు. చివరికి ఒకరోజున సత్యవతమ్మ ఏవో పెళ్లి సంబంధాల గురించి మాట్లాడుతూంటే. తనే మెల్లిగా ఇందిర

సంగతి కదిపాడు. గట్టిగా తనకా అమ్మాయిని చేసుకోవాలని ఉందని చెప్పలేకపోయినా, ఆమె అందం గురించి పొగిడాడు. ఆ పిల్లను చేసుకుంటే బాగుటుం దన్నట్లు సూచించాడు.

"ఆ వాళ్ల కేముందిరా, తిండికే సరిగ్గా లేక అవస్థ పడుతున్నారు. వాళ్లు కట్నమేమిస్తారు? లాంఛనాలేం జరుపుతారు? మనకు తగిన సంబంధం ద్రాక్షారం జమీందారుగారిదేరా, పదివేలు కట్నం ఇస్తామంటున్నారు. లాంఛనాలన్నీ జరుపుతామంటున్నారు. పిల్ల చామనచాయగా పార్వతీదేవిలా ఉంటుంది...."

ఇక కృష్ణమూర్తి విననేలేకపోయాడు. మనసులో మెరిసిన ఇందిర, వాయిలుపైట చెరుగుతో మొహం పెట్టుకుని భోరున ఏడవా లనిపించింది అతనికి.

రంగడికి కూడా పెళ్లి సంబంధాలు వస్తున్నాయి; కాని కృష్ణమూర్తికి వచ్చినంత పై స్థాయిలో రావడంలేదు. ముఖ్య కారణం బంధువు లందరితోనూ, సత్యవతమ్మ తన ఆస్తి నంతా కృష్ణమూర్తికే చెందేట్లు చేస్తుందనీ, రంగడి కేమీ ఇవ్వదనే అభిప్రాయం కలిగింది. ఆమె భర్త ఆమెకు సర్వాధికారాలతోనూ వీలు వ్రాశాడు అంతేకాక భర్త చనిపోయినప్పుడున్న ఆస్తిలో సగమే మిగిలింది, కృష్ణమూర్తి చదువు పూర్తయ్యే సరికి. కమల పెళ్లికి చాలా డబ్బు ఖర్చయింది. పైగా బంధువులు వచ్చి నెలల కొద్దీ తిష్ట వెయ్యడం అంతా ఆడపెత్తనం అవడం వల్ల, ఆస్తి సగం హరించడంతో విశేషమేమీ లేదు. చివరికి

రంగడికి మిగిలేదేమీ ఉండదనీ, వాడిని ఆవిడెల్లాగూ సరిగ్గా చూడదనీ అంతా గ్రహించారు. సత్యవతమ్మకుకూడా రంగడికి చదువు లేకపోవడంవల్లా, అల్లరి చిల్లరిగా తిరుగుతున్నాడనీ, వాడికి తగిన సంబంధం రాదనీ తెలుసు. అందువల్ల వాడి విషయంలో తనేమీ పట్టించుకోదల్చుకోలేదు. ఆమె దృష్టి ఎంతసేపూ ఎం. ఏ. పాసయి లెక్చరరుగా, నలుగురి దృష్టినీ ఆకర్షిస్తున్న కృష్ణమూర్తి పైనే ఉంది. అతని వివాహం ఘనంగా జరగాలి.

అనుకున్నట్లుగానే కృష్ణమూర్తి వివాహము ద్రాక్షారం జమీందారుగారి అమ్మాయితోనే జరిగింది. అతనికి వచ్చిన కట్నం పదివేలూ బాంకులో అతనిపేర వేసి, పెళ్ళిఖర్చు తనే భరించింది. ఆ దంపతుల్ని చూసినవారంతా శివ పార్వతులులా ఉన్నారన్నారు. కృష్ణమూర్తి పొడుగ్గా తెల్లగా ఉంటాడు.

ఈ పెళ్ళి జరిగిన కొద్దిరోజులకు ఒకనాడు తమ వీధిచివర ఉండే స్కూలుమాష్టరు తనతో మాట్లాడడానికి వస్తే కొద్దిగా ఆశ్చర్యపడింది సత్యవతమ్మ. అతడు తన మూడో కూతురైన ఇందిరను రంగడికిచ్చి వివాహం చేసుకోమని అడిగాడు. దానికి కారణం రంగడే స్వయంగా ఆయన వద్దకువెళ్ళి, తను ఇందిరను వివాహం చేసుకుంటానని చెప్పడమేనట. ఈ సంగతి విన్నప్పుడు ఆమెకు చాలా కోపం వచ్చినా, కొద్దిసేపు ఆలోచించిన తరువాత, ఆమె ఈ వివాహానికి అంగీకరించింది. రానురాను రంగడి చేష్టలు ఆవిడిని విసిగిస్తున్నాయి పెళ్ళాం వస్తేనైనా బాగుపడవచ్చు ననుకుంది పైగా వాడు క్రిష్ణమూర్తిలా తను చెప్పిన

మాట వినేరకం కాదు. అందుచేత వాడిష్టప్రకారమే చేయ దల్చింది. రంగడికి అంతకన్నా మంచి సంబంధం రాదనుకుంది.

రంగడి వివాహం నిరాడంబరంగా జరిగిపోయింది. కోడలికి పది తులాల బంగారం పెట్టింది సత్యవతమ్మ. లోకం మాత్రం రంగడి పెళ్ళిని కృష్ణమూర్తి పెళ్ళితో పోల్చి చూచుకుని సత్యవతమ్మ పక్షపాతదృష్టి నాడిపోసుకున్నారు.

కొద్దినెలలతేడాతో ఇద్దరుకోడళ్లూ కాపరానికి వచ్చారు. కృష్ణమూర్తి భార్యపేరు సరళ. వాళ్ళిద్దరికీ పడకగది మేడపైన. అసలే ఆమె జమీందారులబిడ్డ. దానికితోడు లెక్చరరుగారి భార్యా. అందువల్ల ఆమే, ఆమె భర్తా, భోజనానికి తప్ప క్రిందికి రానేరారు. కాఫీ ఫలహారాలు, సత్యవతమ్మే వారికి మేడ మీదకు పంపుతుంది. ఇరవైనాలుగ్గంటలూ, పకపకలూ, వికవికలూ, సంగీతాలూ, షోకు చేసుకోడాలతో వారికి కాలం గడుస్తోంది. అన్నివిధాలా హుషారుగా తనను ఆనందింపజేస్తున్న సరళతో కాలం బాగా గడుస్తున్నా, కృష్ణమూర్తి మనసులో మాత్రం ఇందిర రూపం తొంగిచూస్తుండేది. సరళ స్థానములో ఇందిర లేకపోవడానికి కారణం తనకు రంగడిమున్న తెగింపు లేకపోవడమేకదా—అని బాధపడేవాడు.

క్రిందిభాగంలో, మునుపు కొట్టుగదిగా వాడే, ఒక మూలగదిని రంగడికీ, ఇందిరకూ పడక గదిగా ఇచ్చింది సత్యవతమ్మ. ఎన్నో ఆశలతో ఆ యింట్లో అడుగు పెట్టిన ఇందిర, తన భర్తకు ఆ యింట్లో జరుగుతున్న అన్యాయానికి ఆశ్చర్య

పోయింది. తను మునుపు కొంత వింది. కాని ఇప్పుడు కనులార చూస్తోంది. తన స్థానం ఆ యింట్లో, ఆమెకు కొద్దిరోజులలోనే బోధపడింది. ఒక దాసీదానికున్న విలువకూడా తనకు లేదు. ఎంతసేపూ క్రిష్ణమూర్తికీ, అతని భార్యకూ ఏమి లోటు జరుగుతుందో అని సత్యవతిమ్మ కొట్టుకుపోయేది. రంగడు ఏ వేళప్పుడు వచ్చి భోంచేస్తాడోనని—ఒక్క ఇందిరకు తప్ప మరెవరికీ అక్కరలేదు. రెండుపూటలా భోజనానికీ, రాత్రి పడకకీ తప్ప రంగడు ఆ యింట్లో కనిపించనే కనిపించడు. పగలల్లా ఎక్కడ తిరుగుతాడో ఎవరికీ తెలియదు ఈ యింటి యజమానైన రంగడికోసం, అందరికీ వడ్డించగా మిగిలిన భోజనం ఒక పళ్లెము లో పెట్టి ఒకమూల ఉంచేవారనీ, ఏ టైములోనో వచ్చి రంగడు అది తినిపోయేవాడనీ తెలుసుకుంది.

కాపురానికి వచ్చిన ఆరు నెలల దాకా ఇందిర, ఇంట్లోని పరిస్థితులన్నీ చూస్తూ వింటూ, వోర్పు పట్టింది. కాని ఇక భరించలేకపోయింది ఒకనాటి రాత్రి రంగడికి నిద్రలో మెలుకువ వచ్చింది. పక్కకి చూసే సరికి ఇందిర వెక్కి వెక్కి ఏడుస్తోంది. రంగడి మనస్సు కరిగిపోయింది. ఇందిరను తన చేతుల్లోకి తీసుకుని లాలిస్తూ కారణ మడిగాడు. ఆమె మరింతగా ఏడుస్తూ "మన గతి ఇంతేనా?" అని గట్టిగా ఏడ్చేసింది

రంగడికంతా అర్థమైంది. తను ఈ ఇంటి వాతావరణానికి అలవాటు పడిపోయాడు. తన హృదయం మొద్దుబారి పోయింది. కాని అది ఇందిరకు ఎంత బాధాకరంగా ఉంటుందో

తను గ్రహించలేదు. ఇందిర ఏడుపుతో తనకు కనువిప్పయింది. ఆమెను వోదారుస్తూ, ఆమెను కొద్ది రోజులు వోపికపట్టమనీ, తొందరలోనే తనీ సమస్యను పరిష్కరిస్తాననీ చెప్పాడు రంగడు. మంచి ఆలోచనాపరుడూ, చాలా తెలివితేటలు గలిగినవాడు. కాని మహాసాహసి దేనినైనా ఎదురించి ఫలితాన్ని పొందే రకం. ఎవ్వరూ చెయ్యలేని కార్యాల్ని చేసి సాధించడంలో తృప్తి పొందుతాడు గాని, అందరూ నడిచే బాటను నడవడాని కిష్ట పడడు అటువంటి స్వతంత్ర వ్యక్తిని స్కూల్లో టీచర్లుగాని, ఇంట్లో తల్లి దండ్రులు గాని, బయట పెద్దలు గాని అభిమానించి దగ్గరకు తియ్యరు. స్కూలు టీచర్లు తమ మాట వినటంలేదనే అక్కసుకొద్దీ పరీక్షలు ఫెయిలుజేస్తారు. తలిదండ్రులు, ఎంతో సంస్కారం ఉంటే తప్ప అటువంటి పిల్లల్ని అర్థంచేసుకుని సరియైన దారిలో పెట్టి ప్రోత్సహించరు బయటవారు, వాణ్ని పొగరుబోతనీ, రవుడీయనీ అంటారు. రంగడు రవుడీ కుర్రాళ్లకు నాయకుడు. స్కూల్లో చదివినంత కాలం, మాష్టర్లనూ, ఆడ పిల్లల్ని తెగఏడిపించాడు. వాణ్ణి అదుపులో పెట్టాలని సత్యవతమ్మ ఎంతో ప్రయత్నించి, చివరకు ఏమీ చెయ్యలేక వదిలే సింది. కొన్నాళ్లు, చదువు మానేసేక, అన్ని దురభ్యాసాలకూ లోనై, రెండు మూడేళ్లు తెగ తిరిగాడు. మళ్లీ ఆ దురభ్యాసా లన్నీ మానుకుని మామూలు మనిషై పెళ్లి చేసుకున్నాడు. అలా ప్రపంచం అనే గ్రంథాన్ని తాపీగా చదివి వింతలు తెలుసు కునే వోపికలేక, గబగబ పేజీలు తిప్పి సారాంశాన్ని తెలుసు

కున్నాడు. చివరికి వేదాంతముకూడా అబ్బింది. ఏదెలా జరిగితే అలా జరగనీ—అనే స్థితిలో వివాహం చేసుకున్నాడు. భార్యతో ఆర్నెల్లు కాపురం చేశాక, మళ్లీ—వేదాంతపు మత్తు వదిలి—సామాన్య సంసారయ్యాడు.

అప్పటికి రెండునార్లు, బిజినెస్ చేస్తానని సత్యావతమ్మ వద్ద పదివేలదాకా డబ్బు పట్టికెళ్లి, తగలెయ్యడంవల్ల, రంగడు మళ్లీ ఆమెను డబ్బడిగితే చిల్లిగవ్వ ఇవ్వనంది. గత్యంతరంలేక ఉద్యోగంలోనే చేరదలిచాడు. అదీ, ఆ చుట్టుప్రక్కల ఎక్కడా దొరక్క, దూరపుబంధు వొకాయన బెజవాడలో ఒక టీ కంపెనీలో సేల్సుమాన్‌గా ఉద్యోగం వేయిస్తే వెళ్లి చేరాడు.

దత్తపుత్రుడు తనకు శాంతి సౌఖ్యాలను చేకూర్చక పోయినా చెల్లెలు కొడుకైన కృష్ణమూర్తి ద్వారానే తన ముద్దుముచ్చటలు తీర్చుకుంటూ కాలంగడపసాగింది సత్యావతమ్మ. ఆమెకు తను చెప్పినట్లు నడుచుకుంటున్న కృష్ణమూర్తే రంగడికన్నా ముఖ్యుడనిపించింది. కాని, తనకు పెత్తల్లి నాశ్రయిస్తేనే కాని, కాలం గడవదని చిన్నతనంలోనే గ్రహించి, మనసులో యిష్టం ఉన్నా లేకపోయినా, పెత్తల్లి చెప్పినట్లు వినకపోతే తనొక అనాథననీ, నిరాశ్రయుడననీ, వేరే గత్యంతరం లేక, కృష్ణమూర్తి తన నాశ్రయించాడని ఆమె తెలుసుకోలేదు. సత్యావతమ్మ చెల్లెలు తన కొడుకును దత్తత చేసుకుంటా రను కుంది—అక్కా, బావానూ, కాని వాళ్లు రంగణ్ని దత్తత

చేసుకున్ననాడే, తమకా యింట్లో స్థానం లేదని గ్రహించారు. కమలా, కృష్ణమూర్తీను. వారికి చేతనయినదల్లా పెత్తల్లిని పూర్తిగా లొంగదీసుకుని తమ పబ్బం గడుపుకోవటమే. ఎంత తెలివైనవారైనా, పొగడ్తకు లొంగడం లోకంలో ఉన్నదే. సత్యవతమ్మ కూడా అలాగే లొంగిపోయింది. తనంటే కృష్ణమూర్తికీ, కమలకూ ఎంతో అభిమాన మనుకుంది.

కాలగర్భంలో ఇరవై య్యేళ్లు కలిసిపోయాయి.

కృష్ణమూర్తి ఆరుగురు పిల్లల తండ్రయ్యాడు. ఈ ఇరవై య్యేళ్లలోనూ సత్యవతమ్మ ఆస్తంతా, ఒక్క మేడ తప్ప పూర్తయినట్లే. ఆమెకు వృద్ధాప్యం వచ్చింది. తియ్యగానే కబుర్లు చెప్తూ, ఇంట్లో నౌకర్ల నందర్నీ మానిపించి సత్యవతమ్మకి వంట అప్పగించింది సరళ. మునపటిలా ఆదరంగా పలకరించడం మానేశాడు కృష్ణమూర్తి. మేడను చాలాకాలం క్రిందటే రగడి పేర రాసింది అందువల్ల ఇక ఆమెవద్దనుండి తమకు ముట్టేదేమీ లేదని గ్రహించారు కృష్ణమూర్తి కుటుంబం. ఆమెను ఎలా వదుల్చుకోవాలా అని ఆలోచించసాగారు. ఇంటిల్లిపాదీ. ఆమెను సన్నసన్నగా విసుక్కోవడం ప్రారంభించారు నడుం వంగిపోయినా, దేహం వడిలిపోయినా, అలాగే సాగుతూ వంటచేసి పెడ్తూంటే, మనవలు వంట బాగు లేదని నానామాటలూ అనేవారు.

ఒకప్పుడు ఆమెకు విపరీతమైన చలిజర్వం వచ్చింది. ఈ మధ్య ఆమెకు అడపాదడపా సుస్తీ చేస్తూనేఉంది. ఇంట్లో ఒక

మూల దుప్పటి కప్పుకుని పడుకుంది. ఆరోజు వంట చేసుకోవ డానికి సరళ ఎంత బాధపడిపోయిందో. భర్తతో చెప్తూ, తెగ విసుక్కుంది. ఆమెను దగ్గరకు వచ్చి పలకరించనైనా పలకరించ లేదు—కృష్ణమూర్తి! ఆమె డబ్బు తినడమే కాకుండా, ఆమె చేత చాకిరీ చేయించుకున్న ఆమె మనవలలో ఒక్కరు కూడా వచ్చి మంచినీళ్లయినా ఆమె కివ్వలేదు. సాయంకాలమైనా ఆమె పడుకునే ఉండేసరికే సరళకు కోపం వచ్చింది. ఇహ ఆపూటకి తనే వండాలన్నమాట.

కరెంటు లేకపోవడంవల్ల ఇల్లంతా చీకటిగా ఉంది. వంట యింట్లో ఎంతసేపు వెతికినా అగ్గిపెట్టె కన్పించలేదు. కుర్రవా న్నొకణ్ని అగ్గిపెట్టె కోసం పంపి, తను గదంతా తడుముతోంది. మనస్సులోని అక్కసంతా బయటికి వచ్చేసింది ఆ సమయంలో. "ఈవిడ డొక్కుర్తీ మా నెత్తిమీదకి. మాటాడితే మూలుగుతూ పడకేస్తుంది. ఎంతో పెద్ద అభిమాన మున్నదానిలా మమ్మల్ని వదలదు. 'నీ కొడుకింటికి పోవమ్మా' అంటే ఇక్కడే తిష్ట వేసింది. ఆయన అంతకన్నాను. ఈవిడేదో మనకి చేసేసినట్లు మాట్లాడుతారు. ఇన్నాళ్లూ ఈవిణ్ని తిండి పెట్టి పోషించాము; ఇహ చాలు! ఇంతలో ఈ పీడవిరగడైతే బావున్ను. ఏం? ఆ కొడుకు వచ్చి తీసికెళ్లకూడదూ? ఇంకా మమ్మల్నే ఏడి పించాలా? ఈ రోజుల్లో ఒక మనిషికి తిండి పెట్టడం ఎంత కష్టం!" అని సరళ అంటూంటే హఠాత్తుగా లైట్లు వెలిగాయి.

వెంటనే ఆమెకు కన్పించిన దృశ్యంతో ఆమె నిశ్చేష్ట అయింది. సత్యవతమ్మ మంచం దగ్గర, కూచుని ఆమె తల రాస్తున్నాడు రంగడు. చీకటిలో అతని రాక గమనించలేదు. తనన్న మాటలన్నీ వినుంటాడు. ఏం చెయ్యాలో తెలియక, కొద్ది సెకనులు అలా నిలబడి, తరువాత గబగబా మేడమీదకి వెళ్లి, కృష్ణమూర్తితో రంగడు వచ్చాడని చెప్పింది.

కృష్ణమూర్తి మేడ దిగి వచ్చాడు. రంగణ్ణి చూసి "ఎప్పుడొచ్చావ్ ?" అని అడిగాడు. దానికి సమాధానంగా రంగడు "ఇప్పుడే" అన్నాడు, అతని వైపు ఉదాసీనంగా చూస్తూ. ఇద్దరి చూపులూ ఒకేసారి కలిశాయి.

కొద్ది సెకనులు కళ్లు కళ్లతో సంభాషించాయి. రంగడు మునుపెప్పుడూ కృష్ణమూర్తి ఎదుట నిల్చిమాట్లాడేవాడు కాడు. కృష్ణమూర్తి వస్తూంటే తప్పుకునేవాడు ఆ రోజులు వేరు. అప్పుడు కృష్ణమూర్తి పెద్దమనిషి, రంగడు రవుడీ. కృష్ణ మూర్తి బుద్ధిమంతుడు. రంగడు పోకిరి ఇప్పుడు ఇద్దరి స్థితులూ మారాయి రంగడు కూడా పెద్దమనిషే. రంగడి లోపాలు అందరికీ తెలుసు. ఇప్పుడు కృష్ణమూర్తి తత్వంకూడా అందరికీ తెలిసింది. పక్కయింటి రత్తమ్మ, తన కోడలిచేత రంగడి పెళ్లానికి ఉత్తరం రాయించింది. అందులో యిక్కడ సత్య వతమ్మ పడుతున్న అగచాట్లన్నీ వర్ణించింది. తొందరగా వచ్చి రంగడు తీసుకువెళ్తే ఆఖరి క్షణాల్లోనైనా సత్యవతమ్మ సుఖ శాంతులు పొందుతుందని తెల్పింది.

అది చదివిన వెంటనే రంగడు బయల్దేరి వచ్చాడు.

'కృతఘ్నుడా! ఇదా నీ అన్నదాతకు నువుచేసే ప్రత్యుపకారం?' అన్నట్లు రంగడి చూపులకు తట్టుకోలేక తన మొహం ప్రక్కకి తిప్పుకున్నాడు కృష్ణమూర్తి తప్పుచేసిన వాడి మన స్తత్వం ప్రతిఫలిస్తున్న కృష్ణమూర్తి మొహం చూస్తూ "అమ్మని తీసుకు వెళ్దామని వచ్చా" నన్నాడు, రంగడు. సన్నగా, ఎర్రగా, గాలిలో తేలిపోతున్నట్లుండే రంగడు ఇప్పుడు బాగాలావయ్యాడు. కొద్దిగా పొట్టవచ్చింది అతని చిన్న కళ్లు మునుపు చిలిపిగా ప్రక్క చూపులు చూస్తుండేవి. ఇప్పుడవి తీక్షణంగా ఎదుటి వారిని పరిశీలిస్తున్నాయి. పంచె కట్టుకుని లాల్చీ వేసుకుని, దానిమీద సిల్కు కండువా వేసుకున్న రంగణ్ని చూస్తుంటే, తన తప్పులమీద తీర్పివ్వబోతున్న జడ్జీలా కన్పించాడు కృష్ణమూర్తికి. "సరే" నన్నాడు.

వెంటనే రిక్షా పిలిపించి, రంగడు ఆమెను అందులో కూర్చోపెట్టి స్టేషనుకు తీసుకువెళ్లాడు. తమ పీడ విరగడైందని సరళా, ఆమె పిల్లలూ సంతోషించారు. కృష్ణమూర్తి మవునంగా వూరుకున్నాడు.

తల్లిని తన యింటికి తీసుకువచ్చి డాక్టరుచేత మందిప్పించి తనూ, ఇందిరా పరిచర్యజేసి ఎలాగైతేనేం వారంరోజుల్లో ఆమెకు స్వస్తత కలిగేటట్లు చేశారు. సత్యవతమ్మ మెల్లిగా కోలుకుంది. ఇందిర ఆమెను కంటికిరెప్పలా చూసుకుంటోంది.

మనిషి బాగా శుష్కించి నీరసించిపోవడంవల్ల ఏ పనీ చెయ్య లేకపోయేది. కోడలు తనకు అన్నివిధాలా చేస్తూంటే, ఆమె ఎంతో ఆనందించింది. ఇందిరకూడా అత్తగారికి, కృష్ణమూర్తి చేసిన అన్యాయానికి వాళ్లను నిందిస్తూ, తనశాయశక్తులా ఉప చర్యచేసింది. వాళ్లు సత్యవతమ్మను పెట్టిన హింసలూ, వాళ్ల కృత ఘ్నతా, స్వార్ధపరత్వం అన్నీ తమకు తెలిసాయని రంగడూ, ఇందిరా అంటూంటే సత్యవతమ్మ విని వూరుకునేది.

ఒక్కొక్కప్పుడు భర్తతో ఇందిర అనేది, "మీకు ఇంత అన్యాయం చేసిన తల్లిని మీరు కాబట్టి ఆఖరి దశలో ఆదరిస్తున్నారుగాని మరొకరెవరూ ఆదరించరు". దానికి జవాబుగా రంగడు, 'అన్నయ్యకే బాగా సుఖం మప్పి అన్యా యం చేసిందనుకుందాం. నేను కష్టాలలో పెరగడంవల్లనే జీవి తాన్ని అర్థం చేసుకుంటున్నాను. ఒకవిధంగా ఆవిడ నాకుప కారమే చేసిందనుకో" అనేవాడు. ఇందిర వెటకారంగా నవ్వేది.

దత్తపుత్రుడి అభిమానానికీ, కోడలి మంచిబుద్ధికి సత్యవతమ్మ ఎంతో సంతోషించింది. సరళకు, ఇందిరలో మంచి తనం లేశమైనా లేదంటూండేది. ఇప్పటికైనా తమకు చేసిన అన్యాయానికి ఆమె పశ్చాత్తాపపడుతూంటుందని ఇందిర అనుకునేది.

మరొక రెండు నెలలు గడిచాక మళ్లీ సత్యవతమ్మకు హఠాత్తుగా జబ్బుచేసింది. విపరీతమైన జ్వరం, పలవరింతలతో ప్రారంభమైంది. ఒక పూటంతా పరీక్షచేసి, మందిచ్చాక,

ఆమెకు ఆరోజు గడవదని డాక్టరు చెప్పాడు. గంటలలో ఉందనీ, ఆప్తులందకీ తెలియబర్చమని చెప్పాడు. ముఖ్యంగా ఆ ఉదయం నుంచి ఆమె "కృష్ణా" "కృష్ణా" అని పలవరిస్తోంది. కాబట్టి ఆయనను పిలిపించమన్నాడు.

రంగడు కృష్ణమూర్తికి టెలిగ్రాం ఇచ్చాడు.

సాయంకాలం దగ్గర్నుంచి ఎగశ్వాస ప్రారంభమైంది. మూసిన కన్ను, అప్పుడప్పుడు తెరచి, ఎవరికోసమో చూస్తూం డేది. చుట్టూవున్న రంగణ్ని, ఇందిరనూ ఇతర బంధువులనూ, స్నేహితులనూ కాక, ఎక్కడో శూన్యంలోకి చూస్తూండేది. శ్రీకాకుళం వైపునుండి వచ్చేరైళ్లన్నీ వెళ్లిపోయాయి. రాత్రి తొమ్మిదయింది. ఒక్కసారి కళ్లు తెరచింది. రంగడివైపు చూసింది, అతను దగ్గరకు వచ్చాడు. మెల్లిగా, హీనస్వరంతో, "కృష్ణు...డు...రా...లే...దా?" అని అడిగింది. రంగడు తలవూచాడు. అదే సమయంలో "పెద్దమ్మా!" అని కేకేస్తూ, కృష్ణమూర్తి వచ్చి ఆమె చేతుల్లో వాలాడు. ఆమె ప్రాణం అనంత వాయువుల్లో కలిసి పోయింది. కృష్ణమూర్తి గుండెలు బాదుకుని ఏడుస్తూంటే, రంగడు నిశ్చేష్టుడై శూన్యంలోకి చూడసాగాడు.